# జ్ఞానోదయం

ఒక్కొక్కమారు ఇదంతా తన భ్రమేమో అనిపిస్తుంది. స్నేహితులు కూడా ఈ భ్రమనే నిజం చేస్తూ "ఏమిటోయ్ మరీ ఇంత ఇదిగా తయారవుతున్నావు ఈ మధ్య" అంటున్నారు.

'ఇది' అంటే ఎన్ని అర్థాలు!

ఊహించుకోవడం మొదలుపెడితే పక్కన ఏ స్కైలాబ్ లాంటిదో విరిగి మీద పడితే తప్ప ఈ ప్రపంచంలోనికి రాడు ఆనంద్. మెలుకువ రావడం ఆలస్యం అయిపోతుంది. అసలు నిద్రపోని వాడికి మెలుకువరావడం అనేది తమాషాగానే అనిపిస్తుంది. నిద్రో మెలుకువో తేల్చుకోవడం చేతకాని స్థితి తనది.

కళ్ళు తెరుచుకున్నా, మూసుకున్నట్లు వుంటుంది.

పెదవులు వాటంతట అవి కాస్త వణుకుతున్నట్లు వుంటాయి. ఒళ్లు ఒక్కొక్క మారు తూలుతూ ఉంటుంది. ఎదుటివాడు ఏం మాట్లాడుతున్నాడో కాస్త గట్టిగా ఆలోచిస్తే తప్ప అర్థం కాదు.

చాలా సేపటి నుంచి ప్రయత్నిస్తున్నాడు ఆనంద్, నిద్రపోదామని కాని ఏమీ ప్రయోజనం కనిపించడం లేదు.

కంటినిండా నిద్రపట్టి చాలాకాలం అయింది.

మనసుకు ఏ ఆలోచన లేకుండా నిరామయంగా ఉండి ఎన్నో సంవత్సరాలు అయింది. అందరిలాగా ఏదో ఉద్యోగం చేసుకుంటూ ఉదరపోషణకు ఏమీ ఇబ్బంది లేని తనకు ఇటువంటి అవలయమెందుకు ఉండాలో ఆనంద్‌కు సుతరామూ అర్థం కాదు. తను చేసిన పాపం ఏమిటి?

నీ అంత అదృష్టవంతుడు లేడు అంటూ ఉంటారు ఆనంద్‌ను తెలిసినవాళ్ళు.

అంత అసూయపడవలసిన అదృష్టం తనకేం లేదు. కాకపోతే ఇతరులచేత వేలెత్తి చూపించుకోవలసిన తప్పుడు పనులు తనేం చేయలేదు.

తనకు అవసరం రాక చేయలేదా? అవకాశం లేకచేయలేదా? ఏమయితేనేం. చేయలేదు.

పని వెనకాల వున్న మోటివ్ చాలా అవసరం ఆయనదని ఆనంద్‌కు తెలుసు. అందుకే ఇలా విలవిలలాడిపోతున్నాడు అసలు కారణం తెలుసుకుందుకు.

కొన్ని విషయాలు తెలుసుకుంటే గాని మనస్సుకు శాంతి ఉండదు.

కొన్ని విషయాలు తెలిసినమీదట ఉన్న మనశ్శాంతి కూడా హరించి పోతుంది.

ఆనంద్ సాయంత్రం ఆరుగంటల వరకు ఆఫీసులోనే ఉండిపోయాడు. చూడవలసిన కాగితాలన్నీ అయిపోయినా చూచినవే మళ్ళీ చూసి, వ్రాసినవే మళ్ళీ వ్రాసి, కనుచీకటిగా ఉండగా ఆఫీసు వదలి పది అడుగులు వేశాడో లేదో 'హోటల్ మనోరమ' కనిపించింది. ఆలోచిస్తూనే లోపలకు వెళ్ళి దిట్టంగా టిఫిన్ పట్టించి అరకప్పు కాఫీ సేవించాడు.

అప్పుడే ఇంటికి వెళ్ళి ఏం చేయాలి? న్యూస్ పేపరు చదవడం ఉదయమే అయిపోయింది. మధ్యాహ్నంపూట ఆఫీసులో ఏమీ తోచక రెండు గంటలసేపు ప్రకటనలు, ధరలు, వాతావరణం శీర్షికలు కూడా చదివేశాడు.

ఇంతసేపూ కాగితాలతోనే వ్యవహారం చేసి, ఈ సాయంత్రంపూట కూడా ఏ పుస్తకమో పట్టుకు కూర్చోవటానికి తలప్రాణం తోకకు వచ్చినంత పని అవుతుంది.

అదే 'సుశీల' ఉంటే ఇంత ఆలోచనలేదు. సుశీల కనడానికి పుట్టింటికి వెళ్ళింది. మరో మూడు నెలలు తాపీగా గడిస్తేగాని ఆమెను ఇక్కడకు మళ్ళీ తీసుకురాగల 'యోగ్యత' కలగదు తనకు.

ఏమీ తోచకపోవడం, ఏం చేసినా ఒకటిగానే ఉండడం, చేసినదాన్ని చేయనిదాన్ని గురించి మనస్సు ఊరికే జలపాతంలాగ ఆలోచన పోతూ ఉండటం.... తటస్థిస్తున్నాయి.

పోనీ సినిమాకు వెళ్ళి కూర్చుంటే కొన్ని గంటల సేపు అనవసరంగా కాలం జరిగిపోవటానికి వీలుంది. కాలహరణానికి ఇదే మంచి మార్గం అనిపించింది.

నిడివయిన సర్వలక్షణ శోభితమయిన తెలుగు సినిమా చూచిన తరువాత మనస్సు నిశ్చలంగా కూర్చోమంటే ఎలా మాట వింటుంది?

సినిమా చూచి బయటపడేసరికి పది గంటలయింది.

ఆనందం తన ప్రమేయం లేకుండానే ఇంటికి చేరుకున్నాడు. దారిలో హోటలు ముందు ఆగి నాలుగు మెతుకులు కతికిపోవాలన్న ధ్యాసలేకపోయింది. తీరా ఇంటికి వచ్చి లైటు వేసుకుని పడక కుర్చీలో మేనువాల్చబోతూ ఉండగా ఆకలంతా బయటకు వచ్చి తనకంటే ముందు కుర్చీలో తిష్టవేసినట్లయింది. ఇప్పుడేం చేసేట్లు? తిరిగి అంతదూరం నడవాలా? ఓపికలేదు. తీరా ఓపిక చేసుకు నడిచినా హోటలు కట్టివేసే టైం గనుక తినడానికి ఏం దొరకకపోవచ్చును. ఆలస్యంగా భోజనం చేస్తే అసలు సకాలానికి చేస్తేనే అంతంతమాత్రం అరిగిచావదు! లేనిపోని అవస్థలు కొని తెచ్చుకోవడం కంటే నోరుమూసుకుని పడుకోవడమే మంచిపని.

ఇంతకూ ఇప్పుడు నిద్రపట్టితే తిరిగి తెల్లవారేంతవరకు ఏమీ ఇబ్బంది ఉండదు.

'నాకు ఎందుకు నిద్రపట్టడం లేదు?' అని ప్రశ్నించుకున్నాడు ఆనంద్. ఇంత పెద్ద సినిమా చూడడం కాస్త ఇబ్బందిగానే ఉన్నట్లుంది. ఇబ్బంది అంటే మరేం లేదుగాని, ఇందులో 'మాటలు' కాస్త పొడుగ్గా ఉన్నాయి అనుకున్నాడు. తన ఆలోచనకు తనకే నవ్వు వచ్చింది.

'మాటలు' పొడుగేమిటి? నాలా తాటిచెట్టు ప్రమాణంలో ఉన్నాయా? సినిమా మాటలు ఎలా ఉండాలో నాకేం తెలుసును... అనుకున్నాడు మళ్ళీ.

నాకు బుద్ధిలేకపోతే పోయింది. నా 'మనస్సు' ఏమయింది అనుకున్నాడు. గది అంతా వెదికాడు. ఏమీ కనిపించలేదు.

ఆనంద్ పెద్దగా చెంపలు వేసుకున్నాడు, పక్కమీదేపడుకుని. లేచే ఓపిక లేదు.

రంగు, రుచి, వాసనలేని తన మనస్సుకే ఇంత తలబిరుసుతనం ఉంటే ఇంక తనకు ఎంత ఉండవచ్చు? తనకు ఏం తెలుసునో, ఏం తెలియదో తెలియకుండా పోతోంది. ఒకరోజు కొకరోజు గడిచినకొద్దీ.

సినిమా మాటలు ఎలా వ్రాస్తారో, ఎలా వ్రాయకూడదో తెలియకపోవచ్చును. అందులో తన తప్పేంలేదు. సినిమా మాటలు రాయడం రానివాళ్లు చాలామంది ఉన్నారు. అంతేకాదు సినిమా మాటలు రాస్తూనే 'బాగా రాయలేదు, రాయడు' అనిపించుకునేవాళ్ళు చాలామంది ఉండి ఉంటారు. ఏమయినాసరే ఈ సినిమాలో

మాటలు పొడుగే అనుకున్నాడు ఈ మాటు మరింత ధీమాగా. కాని ఎందుచేతనో తాను ఈ విషయాన్ని గురించి ఆలోచించకుండా ఉండటమే మర్యాద లక్షణం అనిపించింది. ఆలోచించినకొద్దీ ఆయుర్దాయం తగ్గడం తప్ప ఇంకేం లాభంలేదు. ఎంతశక్తి కావాలి ఒక్కక్షణం ఆలోచించాలంటే! శక్తి క్షీణించిపోవడమే ఆయుర్దాయం తగ్గిపోవడం! అంటే అందులో అనుమానం ఏముంది?

కాని ఊరికే ఉండడం ఎలా? మెలుకువ ఉన్నంతవరకూ ఏదో అనుకుంటూనే ఉండడం మనస్సుకు అలవాటు అయిపోయింది. శరీరం ఊరుకున్నా మనస్సు ఊరుకోదు. కాని తను మాట్లాడుకుందుకు, శరీరానికిగాని మనసుకుగాని అధికారం ఎక్కడుంది? అవన్నీ తన చెప్పుచేతులలో ఉండవలసినవే గదా! జరుగుతున్నది గమనిస్తే తానే వారి చెప్పుచేతులలో ఉన్నట్టు. వాటికి తాను గులామునని అవి కూడా నిర్ధారణగా భావిస్తున్నట్లు అనిపించి, అతనికి చాలా నిరాశ అయింది. 'చీ. వెధవ బతుకు' అనుకున్నాడు.

'నిద్రరాదేం?' అనుకున్నాడు కొద్ది సేపు అయినమీదట.

నా ధ్యాసంతా దేనిమీదో ఉన్నప్పుడు నిద్ర ఎలా వస్తుంది? కనీసం ఈ పూటకయినా హాయిగా నిద్రపోగలితే రేపు ఉదయం తన పనులన్నీ సక్రమంగా చేసుకుందుకు వీలవుతుంది.

అసలు నాకు నిద్రపోదామని లేదేమో! అందుకే నిద్రరావడం లేదేమో! ఎప్పుడూ మెలుకువగా ఉందామని అభిలాష ఉన్నదేమో! తన ధ్యాసంతా 'దేని' మీద ఉంది? నిద్రపోవడం మీదనా? దేనిమీద? దేనిమీద?... ఇలా అనుకుంటూ ఉంటే ఆనంద్‌కు కాస్త 'కొంటెతనం' స్ఫురించింది.

బాగు బాగు. నాకు తోడు శృంగారం కూడానా? నేను చూచివచ్చిన సినిమా మీద నా ధ్యాసంతా ఉండి ఉంటుంది... అనుకున్నాడు. ఆనంద్‌కు చచ్చేంత సిగ్గు అనిపించింది.

'ఇంతకూ సినిమా బాగానే ఉంది. మాటలు అలా ఉంచి, పాటలు బాగా ఉన్నాయి. శ్రావ్యమయిన గొంతులు. దానికితోడు... ' అతని ఆలోచన పూర్తి కాకుండా 'నేను సినిమా మీద విమర్శ చేయడం ఏమిటి? నాకేం తెలిసి ఏడ్చునని?' అనిపించింది.

ప్రతి విషయానికీ తనకు ఇట్లా అవుననీ, కాదనీ అభిప్రాయం ఏర్పడుతుందేం? దీనికేదో తరుణోపాయం కనుక్కోవాలి. లేకపోతే ఇదే పెద్ద జబ్బుగా పరిణమించవచ్చు.

నిద్ర రావడం లేదు గనుక ఇవాళ ఏం చేశానో గుర్తు తెచ్చుకుంటాను అనుకున్నాడు.

గుర్తు ఉన్నంతవరకు నెమరు వేసుకుంటే, ఈ రోజు ఏమీ తప్పులు చేయలేదు. ఆఫీసులో అంతా సవ్యంగానే గడచిపోయింది. కాని... "నువ్వు తప్పుచేయని రోజు లేదు. తిట్లు తినని రోజు లేదు... అదే నీకు ఆహారం" అని ఎవరో అంటున్నట్లు అనిపించింది. ఎవరు ఈ మాటలు అంటున్నది? తన సంగతులన్నీ తనకంటే ఎక్కువగా ఇంకెవరికో తెలిసినట్లుందే! తన సరిహద్దు గీతలు దాటి ఎప్పుడూ బయటకు వచ్చి తిరగలేదు. అలా తిరిగితే తను పూర్తిగా "బైరాగి వెధవ" అయిపోతాడు. కీలెరిగి వాత పెట్టాలి. అన్ని విషయాలలోను ఎంతో జాగ్రత్తగా ప్రవర్తించాలి.

ఆనంద్‌కు ఆఫీసు సంగతులు గుర్తు వచ్చాయి. అక్కడ అనేక రకాల మనుషులు. ఎవరి గొప్ప వాళ్ళు ప్రదర్శించుకుందుకో ఊరికే తాపత్రయ పడుతూ ఉంటారు. వాళ్ళ బారినుండి రక్షించుకోవడం తనకు చాలా కష్టం అయిపోతుంది. అసలు ఆఫీసులంటేనే కాంపిటీషన్ ప్లేసెస్! రేస్ కోర్సులు నయం. ఇక్కడంతా మనుష్యులు, మర్యాద మనుష్యులు ముసుగులు వేసుకుని విషం మింగుతూ ఉంటారు.

ప్రతివాడూ పక్కవాడికి సలహా ఇవ్వటానికి చూస్తాడు. "నేనయితే ఇలా చేస్తాను సుమా!" అని సరిదిద్ది చెప్పటానికి ప్రయత్నిస్తాడు. మంచీ చెడ్డా లేకుండా అడిగితే సలహా చెప్పవచ్చును గాని, ఇలా అయినదానికీ కానిదానికీ మీదపడి ఊరికే "సొంత డబ్బా" వాయించుకుంటూ ఉంటే తమ "లేకితనం" బయట పడిపోతుందని వాళ్ళకు స్ఫురించదు కావును! అతనికి కాసేపు జాలి అనిపించింది వాళ్ళమీద.

పాపం, వాళ్ళకేం తెలుసు! అమాయకులు. అన్నీ తమ పరిధిలో నుంచి ఆలోచిస్తారు తప్ప పరిపూర్ణంగా గ్రహించి చలించలేరు. వాళ్ళ మాటలు వినకుండా లెక్కచేయకుండా తిరుగుతేసరి! అక్కడే ఉంది తన పెద్ద మనిషి తరహా.

ఆనంద్ ఉలిక్కిపడ్డాడు. జీవితంలో వచ్చిన కష్టం అల్లా అదేగదా! అలా తిరగడం చేతకాకపోయినందువల్లనే తను దెబ్బతింటున్నాడు. అవతలివాళ్ళను "ఏడిశారులే" అనుకుని తన ఇష్టం వచ్చినట్లు తాను తిరగడం ఎందరికి చేతనవుతుంది. అతను ఒక్కుమారుగా నీరు కారిపోయినాడు. నేను కేవలం అసమర్థుడిని అన్నట్లుగా చూస్తారు, వాళ్ళు చెప్పిన పనులు చేయకపోతే.

ఆనంద్ ఒక్కుమారుగా వీపు చరుచుకుని ధైర్యం చెప్పుకున్నాడు.

"నేను వాళ్ళ దృష్టిలో వెధవనయినా కావచ్చును. నాకు పూర్తిగా తెలుసును గాని వాళ్ళకేం తెలుసు పాపం". చాలా ధైర్యంగా ఇలా అనుకోగలిగినందుకు తనను తనే అభినందించుకున్నాడు.

ఈ దెబ్బతో తనకు చిత్తశాంతి కలుగుతుందని ఆశించాడు.

కానీ, ఈ శాంతి ఎక్కువ కాలం మిగలలేదు.

తన అంచనాలన్నీ తల్లక్రిందులు చేస్తూ ఆలోచనల పర్వతం మళ్ళీ తనను ఢీ కొన్నది. 'నన్ను గురించి నేననుకున్నది ఎంతవరకు నిజం? - నన్ను గురించి ఇతరుల అభిప్రాయాలు నిజమా? నా మాటలే నిజమా? ఏది నిజంగా నిజం? రెండూ నిజం అవటానికి వీల్లేదు గదా!,

"నాకు అనుకూలంగా ఉన్నదే గుర్తు తెచ్చుకుని నేను గొప్పవాడినని వీపు చరుచుకుంటున్నానా?" అన్న ప్రశ్న వచ్చింది.

"నేనేం చేశాను?" అని మళ్ళీ అంతర్ముఖుడయిపోయినాడు.

ఆఫీసులో శేఖరం వచ్చి కూర్చున్నాడు మధ్యాహ్నం. శేఖరం అంటే తనకు పడదు. పడదంటే మాట్లాడడని కాదు. అతనితో మాట్లాడడం ఇష్టం లేదు. అతను చేసే పని ఏదీ తనకు ఇష్టం ఉండదు. కానీ ఇష్టం లేదనీ ఉండదనీ పైకి చెప్పడు. మర్యాద కోసం చెప్పడు. అంతకంటే మరేం లేదు.

"ఏమండీ ఏం చేస్తున్నారు?" అన్నాడు శేఖరం. ఆనంద్‌కు అరికాలు మంట నెత్తికెక్కింది. 'నేను ఏం చేస్తే ఇతనికెందుకు' అనుకున్నాడు. "ఏమీ చేయకుండా కూర్చున్నావని ఎద్దేవా చేస్తున్నాడా?"

పైకి మాత్రం పెదవుల మీదికి చిరునవ్వు తెచ్చుకుని ఊరుకున్నాడు. "చెప్పండి" అని మాత్రం అన్నాడు.

"ప్రత్యేకించి ఏమీ పనిమీద రాలేదు. చాలా రోజులయింది మీదగ్గర కూర్చుని"

అబ్బ వీడికి ఎంత దయ నా మీద! ఇదంతా ప్రేమేనా? లేక ఏదయినా కూపీ తీయడానికా?

ఈ కాసేపటిలోనే శేఖరం అంటే తనకు కోపం ఉండటానికి కారణాలు ఆనంద్ మనస్సులో సినిమారీళ్ళలాగా తిరిగాయి. రెండు మూడు దృశ్యాలు క్షణంలో సగం సేపట్లో ఇట్టే కనిపించి అట్టే మాయం అయిపోయినాయి.

శేఖరం తనకంటే ఆలస్యంగా చేరాడు సర్వీసులో. ఆఫీసు భాషలో చెప్పుకోమంటే తను "సీనియర్" అయినా పెద్ద పెద్ద వాళ్ళను "కాకా" పట్టి వాళ్ళ అనుగ్రహం దొడ్డిదారిన సంపాదించి శేఖర్ తనకన్నా ముందుగా ప్రమోషన్ సంపాదించేశాడు. నీకంటే నేను పెద్ద హోదాలో ఉన్నాను సుమా అని ధీమాతో తలెగరేస్తూ ఉన్నట్లు అనిపిస్తుంది ఆనంద్‌కు.

శేఖరం భార్య చదువుకున్న పిల్ల. ఆ అమ్మాయి ఎక్కడో ఉద్యోగం కూడా వెలగబెడుతోంది. రెండు జీతాలూ పెట్టుకుని మధ్యతరగతి ఉద్యోగస్థుల సౌకర్యాలను మించిపోయేది అనేకం కొనుక్కున్నారు వాళ్ళు. శేఖరం సాయంకాలాలు సెలవు రోజుల్లో బయటకు వెళ్ళినప్పుడల్లా పెళ్ళాన్ని వెంట తీసుకువెడతాడు. నాకేగా ఇంత అందమయిన పెళ్ళాం ఉందిసుమా అని అందరికీ ప్రదర్శించి సగర్వంగా రొమ్ము విరుచుకు తిరుగుతున్నాడనిపిస్తున్నది ఆనంద్‌కు.

"ఏమిటో ఆలోచిస్తున్నారే ఎదురుగా మనిషిని పెట్టుకుని"

ఆనంద్ మళ్ళీ మామూలు ప్రపంచంలోనికి వచ్చాడు.

"సారీ ఏదో ఇంటి విషయం గుర్తుకొచ్చింది ఊ... చెప్పండి అంతా కులాసాయేనా? ఎలా వున్నారు? నేను ఒక్కడినీ ఇలా అవస్థపడుతున్నాను ఇంకో మూడు నాలుగు నెలలయినా పడుతుంది. బజారులో ధరలు... ఏ గవర్నమెంట్ వస్తే ఏంలెండి, వాటిపాటి కవి పెరిగి పోతూనే ఉన్నాయి...." ఇలా తీరుతెన్నూ లేకుండా మాట్లాడుకుంటూ పోయాడు ఆనంద్.

శేఖరం ఇదంతా అర్థం చేసుకునే స్థితిలో లేడు.

"చల్లకు వచ్చి ముంత దాచడం ఎందుకు? మీతో కొద్దిగా పని ఉండి వచ్చాను"

"ఏమిటి చెప్పండి" అన్నాడు ఆనంద్, కుర్చీలో కుదుమట్టంగా కూర్చుంటూ! ఇన్నాళ్ళకు దొరికిందిరా పిట్ట అన్నట్లు తయారయింది అతని మనస్సు.

"అర్జెంటుగా అవసరం వచ్చింది. రెండువందలు కావాలి. మళ్ళీవారం పదిరోజుల్లో ఇచ్చేస్తాను" అన్నాడు శేఖరం.

అతనెప్పుడూ డబ్బు అడగలేదు. తననే కాదు ఎవరినీ. ఈ సంగతి ఆనంద్‌కు తెలుసు.

కాని నేనెందుకు ఇవ్వాలి?

నాకు ఇతనంటే పడదు నేనెందుకు ఎకామడేట్ చేయాలి?

ఇవ్వకపోతే ఏమయినా అనుకుంటాడా? అనుకుంటే నాకేం?

నా దగ్గర ఈ మాత్రమయినా లేదా అని ఎగతాళి చేస్తాడా? ఏం తన దగ్గర లేనప్పుడు నా దగ్గర ఉండి తీరాలని ఏం నియమం?

"ఉంచుకుని కూడా లేదంటున్నాడు" అంటాడు? అనుకోనీ నాకేం భయం. నాకేం నష్టం?

పోనీలే, నా దగ్గర ఉందిగా! ఇద్దాం పాపం... ఏం అవసరమో ఏమో...

ఉహు... ఉహు ప్రాణం పోయినా ఇవ్వను. ఇవ్వను గాక ఇవ్వను.

శేఖరం తన ముఖంలోకే చూస్తున్నాడు. తన మనసులోని ఆలోచనలన్నీ చదివేయడం లేదు గదా కొంపతీసి. ఏడిశాడు వెధవ. అయినా ఎందుకు కూర్చోనివ్వాలి, తనముందు.

"సారీ శేఖర్" తలవంచుకున్నాను. ముఖంలో ఏమన్నా భావం అతను చదివేస్తాడేమోనని.

'పోనీలెండి, ఫర్‌గెట్ ఎబౌట్ ఇట్" మరెక్కడో చూస్తాను అంటూ శేఖర్ బల్లమీది పేపర్‌వెయిట్ చేతిలోకి తీసుకున్నాడు.

దాంతో నా తలకాయ బద్దలు కొడతాడా అనిపించింది ఆనంద్‌కు.

శేఖర్ పేపర్‌వెయిట్‌ను ఒక చేతిలోంచి మరో చేతిలోనికి మార్చాడు. కళ్ళకు ఎదురుగుండా పెట్టుకుని గాజులోపలి రంగుల్ని పువ్వుల్ని రెండు మూడు క్షణాలు పరిశీలనగా చూశాడు.

"ఇంత అందమయిన పువ్వులు గాజులో ఇరుక్కుపోయాయి. చూడండి" అన్నాడు టాపిక్ మార్చేస్తూ.

వీడి ముఖానికి తోడు సౌందర్య వర్ణనలు కూడాను! అనుకున్నాడు ఆనంద్. తనుకూడా ఏదో అనకపోతే బాగుండదని "అందమయినవన్నీ ఇలాగే ఇరుక్కుపోతాయి. విచ్చలవిడిగా వదిలేస్తే వాడిపోతాయి కదూ అందుకని" అన్నాడు.

"అందాన్ని బందీచేసి" అని ఎక్కడో చదివిన గేయ పాదం గుర్తువచ్చింది ఆనంద్‌కు.

'వస్తానండీ' అని వెళ్ళిపోయాడు శేఖరం. ఆనంద్‌కు తెరిపి అయింది.

"లేదనగానే సరేనన్నాడు. కాస్త బతిమాలితే ఇచ్చేవాడినే" అనుకున్నాడు. ఆనంద్ కాసేపు అయినాక.

ఇవ్వకపోవడంతో శేఖర్ రాజీ అయినాడుగాని ఆనంద్‌కు చేతకావడం లేదు. తరువాత ఏదో అర్జెంటు ఫైలులో మునిగిపోవడంతో తాత్కాలికంగా మరుగుపడింది విషయం. ఇప్పుడు మళ్ళీ ఆలోచనలోకి రావడంతో అతలాకుతలం అయిపోయింది ఆనంద్ పరిస్థితి.

నేనతని పట్ల క్లియర్‌గా లేను. అతనికీ నాకూ పడకపోవడానికీ, అవసరానికి డబ్బు సర్దలేకపోవటానికి ఎందుకు సంబంధం ఉండాలి. అసలు పడకపోవటానికి మాత్రం సజావయిన కారణాలు ఉన్నాయా?

ఈ ఆలోచన రావడంతోటే ఆనంద్‌కు వళ్ళంతా కంపరం ఎత్తినట్లయింది. ఎవరో తనను చొక్కాపట్టుకు గుంజి అడుగుతున్నట్లు అనిపించింది.

నా మనస్సుకు జబ్బు చేసింది.

అందుకే నిద్ర రావడం లేదు అనుకున్నాడు ఆనంద్.

❖